ప్రజాశక్తి

గురువారం 30 నవంబరు 2023 | 5 | శ్రీకాకుళం

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఈ మేళాలో 250 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వివిధ కంపెనీల యాజమాన్యాల నుంచి ప్రతినిధులు హాజరై మౌఖిక పరీక్షలను నిర్వహించి వంద మంది అభ్యర్థులను ఎంపిక చేశారని కళాశాల జెకెసి కో-ఆర్డినేటర్ వై.మణికుమార్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామకపు పత్రాలను ప్రిన్సిపాల్ పి.సురేఖ అందజేశారు. జాబ్‌మేళాలో జెకెసి సభ్యులు డాక్టర్ శ్రీనివాస పాత్రో, రెడ్డి రవికుమార్, రవిశంకర్, డాక్టర్ సూరిబాబు, చలమయ్య, మెంటార్ ఎన్.దామోదర్ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలో కాలువ దుస్థితి (ఫైల్)

'వంశధార' ఆధునికీకరణ ఎప్పుడో!

- రూ.834 కోట్లతో ఎల్‌ఎంసి ప్రతిపాదనలు
- ఆర్‌ఎంసి లైనింగ్ పనులకు రూ.18.35 కోట్లు
- రెండున్నరేళ్లుగా ఎదురుచూపులు
- ఆమోదం తెలపని ప్రభుత్వం

వంశధార కాలువల ఆధునికీకరణ పనుల కోసం ఎదురు చూపులే మిగిలాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునికీకరణ పనులకు 2021-22 ఫిబ్రవరిలో అధికారులు ప్రతిపాదనలు పంపారు. రెండేళ్లుగా ప్రభుత్వం వద్దే ఫైల్ పెండింగ్‌లో ఉండిపోయింది. ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో ఆధునికీకరణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండటంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు ఉంటున్నా... కాలువ గట్టు పటిష్టంగా లేకపోవడంతో సామర్థ్యం మేరకు నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో రైతులకు మరో నష్టం వాటిల్లుతోంది. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కొన్నిచోట్ల గండిపడిన ఘటనలూ చోటు చేసుకున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచి పెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువలు నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండటంలో అంతకుమించి నీటిని వదిలితే గండికొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు ఎడమ కాలువను ఆధునికీరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్ల అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. దీంతో అంచనా వ్యయం పెరగడంతో మరోసారి అధికారులు 2022-23 సంవత్సరపు ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలు రూపొందిస్తున్నారు.

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టా బ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడచినా ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో 2022-23 రేట్లతో కొత్త ఎస్ఎస్ఆర్‌తో అంచనాలను తయారు చేస్తున్నారు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టా బ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో ఈ సంవత్సరం రెండు సందర్భాల్లో చోటు చేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. గత నెలలో వంశధారలో 80 వేల క్యూసెక్కు వరద నీరు ప్రవాహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపుల గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి గతేడాది ఏడాది జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దానినీ రూ.5లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వద్దు

- లబ్ధిదారుని ఒప్పించి లక్ష్యం పూర్తి చేయాలి
- గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణాలపై అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మిస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకం గడువులోగా పూర్తి కావాల్సిందేనని చెప్పారు. రాష్ట్రంలో గృహనిర్మాణ ప్రగతిలో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానం నుంచి నాల్గవ స్థానం వచ్చిందని అన్నారు. పారదర్శకంగా సేవలు అందించడంలో గృహనిర్మాణ శాఖ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. మెగా హౌసింగ్ డ్రైవ్‌లో గృహాల నిర్మాణం పూర్తి చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సచివాలయం వారీగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు లక్ష్యం కేటాయించారని అన్నారు. లక్ష్యాలు పూర్తి చేసేందుకు మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, హౌసింగ్, విద్యుత్‌శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. నిర్మాణంలో జాప్యం జరగకుండా అవసరమైన సామగ్రిని ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి అవసరమైన వసతులను కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల వేగవంతంపై అంతా దృష్టి సారించాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించిన బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. నిధులు సమస్య లేనందున బిల్లుల తక్షణ చెల్లింపులకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. అధికారులు మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల లోటుపాట్ల వివరాలను తెలుసుకొని అధిగమించాలన్నారు. సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుల ఆధ్వర్యాన ఇళ్ల నిర్మాణాలపై సమావేశాలు నిర్వహించి ప్రేరణ కల్పించాలన్నారు. లబ్ధిదారులకు నిర్మాణ దశలో ఉన్న పనులకు ఎంత మేర బిల్లుల చెల్లింపులు చేపట్టారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, డ్వామా పీడీ చిట్టిరాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వి.వి.ఎస్.ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహమ్మద్ దివాన్ మైదీన్

12న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం

ప్రజాసంఘాలతో కలిసి సందర్శించిన మంత్రి

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాసలో ఏర్పాటు చేసిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిని వచ్చే 12న సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో ప్రారంభిస్తామని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిని బుధవారం సందర్శించారు. ఆస్పత్రి పూర్తి స్థాయి పనులు, చేపట్టనున్న వైద్యసేవలు తీరును వారికి చూపించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో ఈ ప్రాంత ప్రజలు ఎంతో మంది ప్రాణాలు పోయాయని అన్నారు. దీనిపై శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజా సంస్థల పోరాటం చేయడం, ప్రజలు వినతులు ఇవ్వడంతో జగన్ పాదయాత్ర సమయంలో కవిటిలో ముఖాముఖి నిర్వహించి సమస్యను గుర్తించారని అన్నారు. అధికారంలోనికి వచ్చిన వెంటనే శాశ్వత పరిష్కారానికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో పాటు రూ.700 కోట్లతో వంశధార నీరు శుద్ధి చేసి ఇచ్ఛాపురం వరకు అందించే బృహత్తర ప్రాజెక్టు సిద్ధం చేశామని అన్నారు. సందర్శనలో యుడిఎఫ్, వివివి. ఎస్‌విఎస్ఎస్, న్యూడెమక్రసీ, ప్రగతిశీల, సిపిఐ, సిపిఐఎంఎల్ లిబరేషన్, రైతు కూలీ సంఘం, జీడి రైతాంగ సంఘం, పలాస యూత్ అసోసియేషన్, ఎస్‌విఎస్ఎస్ ఉద్దానం ఫౌండేషన్, పలాస లేబర్ అసోసియేషన్, గ్రీన్‌ఆర్మీ, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత తోటల పెంపకానికి ప్రోత్సాహం

గ్రామీణాభివృద్ధిశాఖ హార్టికల్చర్ విభాగం జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్షేత్రస్థాయిలో భూములు ఉన్న జాబుకార్డులందరినీ వ్యక్తిగత తోటల పెంపకంపై ప్రోత్సహించడంతో పాటు వారిలో అవగాహనను కల్పించాలని గ్రామీణాభివృద్ధిశాఖ హార్టికల్చర్ విభాగం జాయింట్ కమిషనర్ ఎం.అశోక్ కుమార్ సూచించారు. జిల్లా వెలుగు కార్యాలయంలో జిల్లా ఉపాధి హామీ, వెలుగు సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం చెరువులు, పంట కాలువల్లో పూడికతీత పనులే కాకుండా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే వివిధ రకాల పనులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ విషయమై సమన్వయం ఏర్పాటు చేసుకొని పరస్పరం సమాచారం ఇచ్చుకోవాలన్నారు. తోటల పెంపకం వల్ల రైతులకు అధిక ఆదాయం వస్తుందని, అంతర పంటలూ అదనపు ఆదాయంగా ఉంటాయని అన్నారు. భూములు ఉన్న జాబ్ కార్డుదారుల సమాచారాన్ని సిబ్బంది తక్షణమే సేకరించాలని ఆదేశించారు. పథకం ప్రారంభం నుంచి కూలీల ఆర్థిక వృద్ధిలో ఎటువంటి పురోగతి లేదన్నది ప్రభుత్వాల అభిప్రాయంగా ఉందని తెలియజేశారు. మినీ గోకులాలు, ఫారం పాండ్స్, తదితర వ్యవసాయ రంగ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు మాట్లాడుతూ జిల్లా, క్లస్టర్, మండల స్థాయిలో ఉపాధి హామీ, వెలుగు సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని అన్నారు. పంట పొలాల్లో పంట బావులు తవకంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఎపిడిలు కె.లోకేష్, శైలజ, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రూ.14.60 కోట్ల వ్యయంతో

పైడిభీమవరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ

వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన సిఎం జగన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఆధ్వర్యాన పైడిభీమవరంలో రూ.14.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను వర్చువల్ పద్ధతిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొని మాట్లాడారు. రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కాంప్లెక్స్‌లో ఇప్పటికే రోడ్లు, విద్యుత్, ప్రహరీ, తాగునీటి సదుపాయం కల్పించామని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పరిశ్రమలను నెలకొల్పడం కోసం ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. రానున్న రెండేళ్లలో 1500 మందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అలాగే రూ.30 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు నిర్మాణం, విజయనగరం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే పారిశ్రామికంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్రమీనా, జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం.ఉమామహేశ్వరరావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ బి.హరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంతృప్తే లక్ష్యంగా

ధాన్యం కొనుగోలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని వంద శాతం కొనుగోలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశామని, సమర్థవంతంగా ఈ ప్రక్రియను చేపట్టి రైతాంగాన్ని సంతృప్తి పరచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణకు సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుకు లబ్ధిచేకూర్చే విధంగా ధాన్యం సేకరణ నిర్వహించాలని అధికారులను సూచించారు. గతేడాది ధాన్యం సేకరణలో అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు 3,800 వాహనాలను గుర్తించామని, వాటిలో 2,035 వాహనాలకు జిపిఎస్ అమర్చామని తెలియజేశారు. జిపిఎస్ అమర్చిన వాహనాలన్నింటినీ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ శనివారంలోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు. మిల్లర్లు రైతుల నుంచి అన్లోడింగ్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద వెహికిల్ ఓనర్, డ్రైవర్ మొబైల్ నంబర్లు, చిరునామాలు ఉండాలన్నారు. రైతులు సచివాలయాలకు ధాన్యం సిద్ధంగా ఉన్నట్టు సమాచారం తెలిపిన వెంటనే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ధాన్యం రవాణాకు వెహికిల్‌ను సిద్ధం చేసి మిల్లులకు ధాన్యం పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత మిల్లర్లు అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించిన లారీ యజమానుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఆ సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. మిల్లుల వద్ద అన్ లోడింగ్ సమయంలో ధాన్యం నాణ్యత, తూకంలో రైతులు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కొన్ని మండలాలకు వెహికల్ అందుబాటులో లేవని, స్థానికంగా ఉన్న వాహనాలకు జిపిఎస్ అమర్చడానికి చర్యలు తీసుకునేందుకు రవాణాశాఖ అధికారులతో చర్చించినట్టు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు, టెక్కలి సబ్ కలెక్టర్ నురుల్ కమర్, జిల్లా తూనికలు కొలతల అధికారి శంకర్ విశ్వేశ్వరరావు, శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, జిల్లా మోటారు వాహనాల అధికారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రాపర్టీ కేసులు ఛేదించాలి

నేర సమీక్షలో ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాపర్టీ కేసుల నియంత్రణ చర్యలు చేపట్టాలని, దర్యాప్తులో ఉన్న ప్రాపర్టీ కేసులు ఛేదించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక దిశ నిర్ధేశం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబరు నెలకు సంబంధించిన కేసులపై బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆస్తి నేరాలు దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. నేరస్తులను, కేసు ప్రాపర్టీని ఛేదించాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని కార్డెన్ సెర్చ్ నిర్వహించి కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. దర్యాప్తు పెండింగ్ ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరగాలని పేర్కొన్నారు. జగన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్రవర్తనతో నడుచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పగటి పూట, రాత్రి వేళ గస్తీలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులపై దృష్టిసారించాలన్నారు. నాన్ బెయిల్ వారెంట్స్ వీలైనంత వరకు అమలు చేసి న్యాయస్థానంలో హాజరు పరచాలన్నారు. గ్రేవు కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు.

ఉత్తమ ప్రతిభకు ప్రసంశాపత్రాలు

ఎక్కువ మొత్తంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదులో ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి.ప్రసాదరావు, జి.అప్పారావు (ఎస్ఐ సారవకోట) ఎల్.రామకృష్ణ (ఎస్ఐ టెక్కలి) దర్యాప్తులో ఉన్న కేసులు ఫైనలేజ్లో వి.సత్యనారాయణ (ఎస్ఐ ఎచ్చెర్ల), ఖాదర్ బాషా (కాశీబుగ్గ ఎస్ఐ), ఎ.విజయ కుమార్ (శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ), నర్సింగరావు (మెళియాపుట్టి ఎఎస్ఐ), బెస్ట్ రైటర్స్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, అంకిత భావంతో విధులు నిర్వహించే మహిళ పోలీసులకు అభినందిస్తూ ప్రసంశాపత్రాలను అందజేశారు.

సిఐ రవి ప్రసాద్‌కు సన్మానం

గతంలో సోంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన రవిప్రసాద్‌కు ఎస్‌పి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సమీక్షలో అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు,జె.తిపేస్వామి, డిఎస్‌పిలు .బాలచంద్రారెడ్డి, డి.నాగేశ్వరరెడ్డి, విజయకుమార్, ఎస్.వాసుదేవ్, జి.వి.ప్రసాద్, ట్రైనీ డిఎస్పిఇ సిహెచ్.రాజా, ఎఒ పరిపాలన అధికారి సిహెచ్.గోపీనాథ్ పాల్గొన్నారు.

ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

కేసుల రాజీకి సహకరించాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల 9న జిల్లాలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహన ప్రమాద కేసులను ఎక్కువగా రాజీ చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. కోర్టు సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల పోలీస్ స్టేషన్లకు, కోర్టులకు పని భారం తగ్గుతుందన్నారు. పెద్ద పెద్ద కేసులు సీరియస్ ఆఫెన్సెస్ విషయంలో దృష్టి పెట్టడానికి అవకాశం దొరుకుతుందన్నారు. కక్షిదారుల మధ్య శాంతి సౌభ్రాతృత్వం నెలకొల్పబడుతుందన్నారు. సమస్యకు శాశ్వతమైన పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. అందువల్ల సాధ్యమైనంత వరకు కక్షిదారులకు కౌన్సెలింగ్ చేసి ఎక్కువ కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లాలోని అదనపు జిల్లా జడ్జిలు శ్రీదేవి, మహేంద్ర, ఫణికుమార్, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు ఎస్‌పి తిప్పేస్వామి, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు



మాట్లాడుతున్న ఎంపిపి ఉమ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమామల్లేశ్వరరావు, సభ్యులు కలిసి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు వచ్చినప్పటికీ అధికారులు మాత్రం పనులు ఉన్నాయని చెప్పి హాజరు కావటంలేదని, ప్రతీ సమావేశానికి ఇలాగే చెబుతున్నారని, హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీర్మానించామన్నారు. అలాగే ధాన్యం రైస్‌మిల్లుకు తీసుకు వెళ్ళిన తరువాత కుంటుసాకులు చెప్పి రైస్‌మిల్లు యాజమాన్యం బస్తాకు మూడు కిలోలనుంచి ఐదు కిలోల వరకు ఎక్కువ తీసుకుంటున్నారని సిఎస్‌డిటి కె.రాముకు సభ్యులు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, ఎంఇఒ ఎల్‌వి.ప్రతాప్, ఆర్‌అండ్‌బి జెఇ సరోజ, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పంచాయతీ రాజ్, అర్‌డబ్ల్యూఎస్ ఎఇలు, శ్రీలత, కావ్యశ్రీ, మండల విప్ బొడ్డు అప్పన్న, నూక సత్యరాజ్, పేడాడ వెంకటరావు, కేశవరావు, మెట్ట సింహాచలం, బమ్మిడి గణపతి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

మండల బడ్జెట్ ఆమోదం

నందిగాం: మండల పరిషత్ 2023-24 సంవత్సర సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్ సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్లో వచ్చిన ఆదాయానికి గాను 15శాతం షెడ్యూల్ కులాల సంక్షేమానికి, 6శాతం షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కొరకు, 15శాతం మహిళా శిశు సంక్షేమానికి కేటాయించారు. 12శాతం తాగునీరు, 23శాతం మెయింటెనెన్స్, 15శాతం కార్యాలయపు నిర్వహణ నిమిత్తం, 10శాతం మండల సెక్టోరియల్ యాక్టివిటీ, నాలుగు శాతం కంటిజెన్సీ అగంతక వ్యయం కేటాయిస్తూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపిడిఒ శివప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, వైస్ ఎంపిపిలు సువ్వారి వసంత కుమార్, ఆర్. లక్ష్మీకాంతం, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నెల రోజుల్లో తాగునీరు అందించాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

సరుబుజ్జిలి : శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిల ద్వారా చేపడుతున్న పనులను పూర్తిచేసి నెల రోజుల్లో తాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. బుధవారం మండలంలో మతలబుపేట, చిన్న మతలబుపేట, గోనెపాడు గ్రామాల్లో రూ. 1.75 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మతలబుపేట గ్రామంలో స్పీకర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సమయంలో ఎన్నికల ముందు శంకుస్థాపన చేస్తున్నారు, పనులు ఎప్పటికి పూర్తవుతాయో, తాగునీరు ఎప్పుడు అందుతుందోనని మహిళలు స్పీకర్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఎన్నికలకు వెళ్లే ముందే మంచినీటి కొళాయిలను ప్రారంభోత్సవం చేసి ఇంటింటికి తాగునీరు అందిస్తానని తెలిపారు. తక్షణమే పనులను ప్రారంభించి పనులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవిజె సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, సర్పంచ్ వీరఘట్టపు జయలక్ష్మి, కృష్ణ గోనెపాడు సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, మాజీ సర్పంచ్ మామిడి తిరుపతిరావు పాల్గొన్నారు.

బూర్జ: అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు అన్నంపేట గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనటువంటి వారు సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా కృషి చేశానన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు సమపాలల్లో అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తూ, జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ మొత్తాన్ని అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, టిట్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, నాయకులు కొరికాన శంకరరావు, మామిడి ఆదినారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూండి-నౌపడ స్టేషన్ల మధ్య రౌతుపురం పాసింజర్ హాల్ట్ సమీపంలో బుధవారం రైలు ఢీకొట్టిన ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ ఎస్ కె. షరీఫ్ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 45 ఏళ్లు ఉంటుందని తెలిపారు. ఆకుపచ్చ దుస్తులు ధరించి ఉందని, మృతురాలి వద్ద లభించిన ఆధారాలు బట్టి ఆ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళే ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 9440627567 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పేదలకు హుదూద్ ఇళ్లు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాట్లాడుతున్న వాణి

మండలంలో నిరు పేదలకు హుదూద్ ఇళ్లు పంపిణీ చేయనున్నట్లు టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. బుధవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో హుదూద్ ఇళ్లు టిడిపి కార్యకర్తలకు ఇవ్వడానికి ప్రయత్నం చేశారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్భాగ్యులైన పేదలకు అధికారులు ఎంక్వయిరీ చేసి 90 మందిని గుర్తించారని, వాళ్లకే గురువారం ఇవ్వడం జరుగుతుందన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలంలో విడతల వారీగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇల్లు లేని కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో జగనన్న స్థలాలతో పాటు ఇల్లు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

ఒపిఎస్ ముద్దు

ప్రజాశక్తి- నందిగాం

యుటిఎఫ్ మండల మహాసభను నందిగామ మండల పరిషత్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి కె.దాలయ్య హాజరై మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తానన్న సిఎం నాలుగేళ్లు దాటినా ఒపిఎస్ అమలుచేయలేదని, ఇప్పటికైనా జిపిఎస్‌లను రద్దుచేసి ఉద్యోగులందరినీ ఒపిఎస్‌లోకి తేవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని, డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి విద్యావ్యవస్థను కాపాడాలని ప్రభుత్వానికి సూచనచేశారు. అనంతనం యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక చేపట్టారు. గౌరవాధ్యక్షులుగా జె.చంద్రశేఖరరావు. అధ్యక్షులుగా కె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా వై.గణపతి, సహాధ్యక్షులుగా పి.వేణు, ఎం.బాలామణిలు, ట్రెజరర్‌గా బాపూజీలతో పాటు 15 మంది మండల కార్యదర్శులను, 6 గురు జిల్లా కౌన్సిలర్లను, ఇద్దరు ఆడిట్ కన్వీనర్లగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. ధర్మారావు, టెక్కలి యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నౌపడ : ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

నౌపడ: మండలం నూతన యుటిఎఫ్ కార్యవర్గాన్ని యుటిఎఫ్ సభ్యులు ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎర్నాగుల వాసుదేవరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి గుండు సూర్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన యుటిఎఫ్ కమిటీకి గౌరవ సలహాదారునిగా లఖినాన వెంకటరమణ, గౌరవ అధ్యక్షులుగా కానూరు ఆనందరావు, అధ్యక్షులుగా కుసుమూరు పాపారావులను ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా పిల్లల ఫాల్గుణరావు, చదువుల మాలతి, ప్రధాన కార్యదర్శిగా దేవాది గణపతిరావు, కోశాధికారిగా యర్నాగుల సింహాచలం ఎన్నికయ్యారు. వీరితో పాటు 13 మంది కార్యదర్శులు, 11 మంది జిల్లా కౌన్సిలర్లు నియమించుకున్నారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా తిప్పాన నారాయణరెడ్డి, సిపిఎస్ కమిటీ కన్వీనర్‌గా బడగల వెంకటగిరి, మహిళా కమిటీ కన్వీనర్‌గా మాదాసు మీనాక్షి ఎంపికయ్యారు. ఈ మేరకు నూతనంగా ఎన్నుకోబడిన యుటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రేపు 'గురజాడ' వర్ధంతి

శ్రీకాకుళం అర్బన్ : మహాకవి గురజాడ అప్పారావు 108వ వరథంతి సభను గురువారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సమావేశం మందిరంలో నిర్వహి స్తున్నట్లు సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమా ర్‌రాజు ఆత్మీయ అతిథిగా హాజరవు తారని పేర్కొన్నారు. ఈ సభలో గుర జాడతో ముడిపడిన వివిధ అంశాలపై సంక్షిప్త ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. వర్తమానస్థితి-గురజాడ తాత్విక దృష్టిపై పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి. ఎస్.శర్మ, సనాతన ధర్మంబి గురజాడ ఆలోచనపై ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, కళింగాంధ్ర చరిత్ర-అవశేష కర్తవ్యంపై అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు పాల్గొని మాట్లాడతారని అన్నారు. మతం-గురజాడ దృక్కోణం గురించి ప్రజా సాహితి సంపాదకులు పి.ఎస్. నాగరాజు, ఆర్థిక వృద్ధి-స్వావలంబనపై మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, యువతకు గుర జాడ సందేశం గురించి గురజాడ అధ్య యన వేదిక అధ్యక్షులు పత్తి సుమతి, మహిళా సాధికారిత-గురజాడ అం శంపై తెరవే కార్యదర్శి ఆర్.వి.రమణ మూర్తి ప్రసంగిస్తారని వివరించారు. ఈ సభలో సాహితీ చైతన్య కిరణాలు సమస్త ప్రతినిధి భోగిల ఉమామహేశ్వ రరావు, కథానిల యం ప్రతినిధి దాసరి రామచంద్ర రావు, కవితా నిలయం ప్రతినిధి ఈవేమన, వర్ధమాన కవి కంచరాన భుజంగరావు తదితరులు కూడా ఆత్మీయ సందేశాలు అందిస్తారని తెలిపారు. ఈ సభ నిర్వహణలో, అభ్యుదయ రచయితల సంఘం, జన సాహితీ, శ్రీకాకుళ సాహితి, తెలుగు రచయి తల వేదిక, కవితా నిలయం, గురజాడ అధ్యయన వేదిక, సాహితీ స్రవంతి, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం భాగస్వాములుగా ఉన్నాయన్నారు. వర్ధంతి సంద ర్భంగా డాక్టర్ అంబేద్కర్ యూనివ ర్సిటీ, ఆర్ట్స్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించి న వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు.

కేను తినిపిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

ఘనంగా హారికా కనస్ట్రక్షన్స్ వార్షికోత్సవం

శ్రీకాకుళం: ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగించడం ద్వారా హారికా కనస్ట్రక్షన్స్ విజయపథం వైపు దూసుకుపోతోందని వివిధ రంగాల ప్రముఖులు, సుడా, టౌన్ ప్లానింగ్ అధికారులు అన్నారు. హారికా కనస్ట్రక్షన్స్, కన్సల్టెంట్స్ సంస్థ 14వ వార్షికోత్సవాన్ని నగరంలో సానావీధిలో సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. హారికా కనస్ట్రక్షన్స్ అధినేత హారికాప్రసాద్ దంపతులను వివిధ రంగాల ప్రముఖులు పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు. హారికాప్రసాద్ మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా తాను సివిల్ ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలో ఉన్నప్పటికీ తనతో పాటు ప్రయాణం చేస్తున్న వారందరి కోసం హారికా కనస్ట్రక్షన్స్ ఏర్పాటు చేశామని, ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారంతా సమాజానికి ఉపకరించే రీతిలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సుడా ప్లానింగ్ అధికారి రామ్మోహన్, డిటిసిపిఒ కిషోర్, జెసిఐ సెనేటర్, సీనియర్ న్యాయవాది పాలిశెట్టి మధుబాబు, జెసిఐ గ్రీన్ సిటీ అధ్యక్షురాలు మణిశర్మ, మాతా కనస్ట్రక్షన్స్ అధినేత ఆచంట రాము, టిపిఒ ఉమామహేశ్వ రరావు, హర్షవల్లి లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి, రాణిస్ డెంటల్ స్కిన్, హెయిర్ కేర్ అధినేత డాక్టర్ కరణం హారిక పాల్గొన్నారు. వార్షికోత్సవ కేక్‌ను హారికా కనస్ట్రక్షన్స్, కన్స ల్టెంట్స్ ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖుల సమక్షంలో కట్ చేశారు.

స్పీకర్‌ను కలిసిన ఎక్సైజ్ ఇఎస్

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్పీకర్ తమ్మినేని సీతారాంను ఎక్సైజ్ ఇఎస్ సుబ్బారావు పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్‌గా మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో పని చేస్తూ అక్కడి నుండి బదిలీపై జిల్లాకు వచ్చారు.

ఎంజిఆర్‌ను సన్మానిస్తున్న యువకులు

నాయకత్వ మార్పుపై యువత ఆసక్తి

ప్రజాశక్తి- హిరమండలం

మండల కేంద్రంలో స్థానిక కృష్ణవేణి కళ్యాణ మండపంలో యువత ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజిఆర్ మాట్లాడుతూ వారసత్వ, వలస నాయకుల వలన నియోజకవర్గం వెనుకబాటుకు గురైందని, వలస వారసత్వ రాజకీయాలను స్వస్తి చెప్పి స్థానికులకు పట్టం కట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో తప్పక పోటీలో ఉంటానని తెలిపారు. యువతని ఉద్దేశించి మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు యాళ్ల నాగేశ్వరరావు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, గొట్ట మాజీ సర్పంచ్ చాపల రామారావు, పైల శాంతారావు, రెల్ల దాము, చిన్న, పండు, యువకులు పాల్గొన్నారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 4 మండలాలు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డికి లేఖ ద్వారా కోరడం జరిగిందని సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 4మండలాలు, మున్సిపాలిటీకి చెందిన రైతులు ఈ ఏడిది ఖరీఫ్‌లో వరి పంట పూర్తిగా నష్టపోయి తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. నియోజకవర్గంలో కేవలం వర్షాధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులకు వరి విత్తనం వేసిన దశ నుంచి వర్షాభావం వలన చాలా వరకు వరినాట్లు వేయలేదని, నాట్లు వేసినా పంట ఎదుగుదల దశలో వర్షాలు పడకపోవడంతో పంటలుపాడై పూర్తిగా నష్టపోవడం జరిగిందని, ఖరీఫ్‌లో సాధారణ వరి పంట కన్నా తక్కువ వరిపంట సాగు జరిగిందని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ఉందని కరువు మండలంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పరిస్థితిని స్వయంగా వెళ్లి చూసి మంత్రికి వినతి పత్రం పంపించడం జరిగిందన్నారు. ఈ పరిశీలనలో రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావునున్నారు.

హుదూద్ ఇళ్లు పేదలకు ఇవ్వాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

2014లో హుదూద్ రూపంలో వచ్చి ప్రకృతి విలయానికి పేదలు నిరాశ్రయులయ్యారని, వారిని దృష్టిలో ఉంచుకొని అప్పటి టిడిపి ప్రభుత్వం హుదూద్ గృహాలను యుద్ధప్రాతిపదికన నిర్మించిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు బుధవారం లేఖ ద్వారా కోరారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణలో సర్వం కోల్పోయిన వారికి అప్పటి కలెక్టర్, అధికార యంత్రాంగం కూడా ఇందులో గృహ సదుపాయం కల్పించారని అన్నారు. ప్రస్తుత అధికారు లు ఆ ఇళ్లను వైసిపి నాయకులకు, కార్యకర్తలకు కట్టబెడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం గుర్తించిన లబ్ధిదారులపై విచారణ చేపట్టి నిజమైన నిరాశ్రయులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి యశోద

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను స్థానిక జెడ్‌పిటిసి తడక యశోద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన ఆటస్థలం ఆక్రమణలకు గురవుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు జెడ్‌పిటిసిని కోరారు. కార్యక్రమంలో పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, ఎంఇఒ జోరాడు, ఎన్.జోగారావు, బి.ధర్మరాజు, వి.వెంకన్న, లోకనాథ్, సురేష్, హెచ్ఎం సోమేశ్వరరావు పాల్గొన్నారు.

గోరుముద్ద నాణ్యతపై స్పీకర్‌కు ఫిర్యాదు

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఫిర్యాదు చేశారు. బుధవారం గోనెపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు బగాది సుమంత్, లడగల దివాకర్, మెట్ట భాను ప్రసాద్, కంచరాపు బాలు, గొండు భార్గవ్‌తో పాటు మరో 15 మంది విద్యార్థులు స్పీకర్ వద్దకు వచ్చి తమ పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటుందని, ఆ భోజనాన్ని తినలేక పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన స్పీకర్ విద్యార్థులకు న్యాణ్యమైన భోజనం అందించకపోవడం మంచి పద్ధతి కాదని దీనిపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు హామీ ఇచ్చి అక్కడ నుండి వెనుదిరిగారు.

స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపికి కంచుకోటని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవ్వరు అడ్డుకోలేరని ఎమ్మెల్యే అశోక్ బాబు స్పష్టం చేశారు. బుణవారం పట్టణంలో జాతీయ రహదారికి సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన టిడిపి పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అశోక్ బాబు ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలో వేసిన పంటలు ఎండిపోయాయని, కరువుతో విలయతాండవం చేస్తుంటే వైసిపి నేతలు నిమ్మకి నీరెత్తినట్లు ఊరుకోవడం శోచనీయమని విమర్శించారు. సాధికారిత యాత్రపై గొప్పలు చెప్పుకునే ఇన్‌ఛార్జికు కరువు మండలాలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఏమి సాధించారని సాధికారిత యాత్ర చేస్తున్నారని అన్నారు. రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని, కనీసం ఒక్కరికి ఒక్క రూపాయి రుణం ఇచ్చారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేనతో కలిసి ముందుకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ, నందిక జాని, ఆసీ లీలారాణి, కాళ్ల జయదేవ్, దక్కత ఢిల్లీరావు, సీపాన వెంకట రమణ, రెయ్య జానకీరావు, కొండ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీలు నిర్వీర్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి ప్రభుత్వం ఏర్పాటు తరువాత పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కనుమరుగైపోతుందని ఉమ్మడి జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. నియోజకవర్గం పరిధిలో ఇచ్ఛాపురం పట్టణంలో బెల్లుపడ రోడ్‌లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో 12,918 గ్రామ పంచాయతీలు 14, 15 ఆర్థిక సంఘంలో విడుదల నిధులు కూడా ప్రభుత్వ పథకాలకు పక్కదారి పట్టించారన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా చేయలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లు గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారన్నారు. రాజకీయాలకు అతీతంగా డిసెంబర్ 10న రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అన్ని పార్టీలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు అనెపు రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ చేస్తున్న సాయిరాజ్

సాయిరాజ్ పరామర్శ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం కేదారిపురం పంచాయతీ గ్రామంలో నర్సింగ్ శెట్టి పూరి ఇల్లు ఇటీవలే అగ్నిప్రమాదం వల్ల పూర్తిగా కాలిపోవడంతో విషయం తెలుసుకున్న వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం తరుపున అందాల్సిన సాయం సకాలంలో అందజేసేట్టు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అంతకు ముందు వై నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే మళ్ళీ జగన్ రావాలి అన్నారు. కార్యక్రమంలో సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, టౌన్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, సర్పంచ్ నీలాపు సారధి, కారంగి మోహనరావు, ఉప్పడ రాజారెడ్డి, పిలక సంతు, నర్తు శివాజీ, దక్కత నూకయ్య రెడ్డి, రంపత్ని చిట్టిబాబు, కోగయ్య రెడ్డి పాల్గొన్నారు.

లోకేష్‌ని కలిసిన 'కలిశెట్టి'

ప్రజాశక్తి- రణస్థలం

లోకేష్‌తో అప్పలనాయుడు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం నియోజకవర్గంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం కలిసారు. ఈ సందర్భంగా పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికలు, నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస: 33/11 కెవి పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి వెంకయ్య పేట ఫీడర్, 11 కెవి అక్కులపేట ఫీడర్ మరమ్మతులు, చెట్లుకొమ్మలు తొలగించే భాగంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. బొడ్డేపల్లిపేట, వెంకయ్య పేట, లక్ష్మడు పేట, జగ్గు శాస్త్రుల పేట, మండాది, మండాది బ్రిక్స్ ఏరియా, పార్వతీశంపేట, రాధాకృష్ణాపురం, ప్రభుత్వ ఆస్పత్రి, తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

పలాస: కెటిరోడ్ విస్తరణ పనుల్లో భాగంగా గురువారం కాశీబుగ్గలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హరిశంకర్ థియాటర్ ప్రాంతం, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్, డెంకివీధి, పల్లివీధి, ఆంధ్రాబ్యాంక్, మహారాణిపేట, న్యూకాలనీ, ఫిష్ మార్కెట్, గాంధీనగర్, శారదానగర్. పెంటవీధి, తిలక్‌నగర్. హరిజనవీధి ప్రాంతాల్లో చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లావాసులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిష్టాత్మక సీనియర్ నేషనల్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. ఆలిండియా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు డిసెంబరు 3 నుంచి 10 వరకు పంజాబ్‌లోని లుధియానాలవ వేదికగా జరుగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు కె.జయకృష్ణ, మహిళల జట్టుకు ఎం.డి. హాఫీజ ఎంపికయ్యారు. ఈ పోటీలకు ముందు చిత్తూరు వేదికగా జరిగిన శిక్షణా శిబిరాల్లో క్రమశిక్షణగా అత్యద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకోవడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, డిఎస్ఎ కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి తెలిపారు. జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులకు జాతీయ పోటీలకు అవకాశం లభించడంపై జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ పోటీల్లో ఆంధ్రా జట్లను విజయపథంలో నిలపాలని ఆకాంక్షించారు.

ఇద్దరూ ఉద్యోగులే.

కాగా, జాతీయ పోటీలకు ఎంపికైనవారి ఇద్దరు క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. ఇందులో కె.జయకృష్ణ ఎల్ఎన్‌పేట మండలం రావిచంద్రి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఎం.డి.హాఫీజ శ్రీకాకుళం దిశా పోలీస్‌స్టేషన్ లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. గతంలోను అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తు గుర్తింపు పొందారు. వీరి ఎంపికపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, డిఎస్‌డిఒ డాక్టర్ శ్రీధరరావు, బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు, పిఇటి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెస్సార్, అర్జున్ రెడ్డి

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన తరగతులు నిర్వహించామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఐక్యరాజ్య సమితి 2023 ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. అందులో భాగంగా ఎఐసిటి సూచనల మేరకు చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్యం, వాణిజ్య అవకాశాలు బిటెక్, ఎంబిఎ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వంటివాటిపై చైతన్య పర్చామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ఎ.ఎస్.శ్రీనివాసరావు, విభాగాల అధిపతులు, జి-20 కార్యక్రమాల సమన్వయకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.భాస్కరబాబు సదస్సులను పర్యవేక్షించారని తెలిపారు.

కరాటేలో బాలికల సత్తా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పురుషోత్తపురం పాఠశాల విద్యార్థులు కరాటిలో సత్తా చాటారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో విశాఖలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పురుషోత్తపురం పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన టి.సాయి ప్రియ, డి.పూజ ప్రతిభ చాటి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. సాయి ప్రియ 43 కేజీలు, 14 సంవత్సరాల విభాగంలో కాటా నైపుణ్యంలో రజితం సాధించగా కుమిటి (ఫైట్)కి కాంస్యం సాధించారు. పూజ 13 సంవత్సరాలు, 25 కేజీల విభాగంలో కోటలో కాంస్యం సాధించగా, కుమిటిలో స్వర్ణం సాధించారు. పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.లతతో పాటు పాఠశాల సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. కోచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రాంప్రసాద్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

నిబంధనల మేరకు ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- పోలాకి

ఓటర్లు జాబితా నమోదులో, తొలగింపులో నిబంధనలు పాటిస్తామని, ఏ రాజకీయపార్టీలు అపోహలు పడొద్దని తహశీల్దార్ కె.శ్రీరాములు తెలిపారు. బుధవారం మండలంలో కళ్యాణ మండపంలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఓటర్లు జాబితా నమోదైన వివరాలు, తొలగింపు వివరాలు పంచాయతీ వారి తెలిపారు.

కార్యక్రమంలో డిటి శ్రీనివాసరావు, నాయకులు ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, కణితి సత్తిబాబు, సర్పంచ్‌లు, టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుప్పట్లు మధు, అన్ని పార్టీల నాయకులు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

సంతబొమ్మాళి: మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లేవలస ఆధ్వర్యాన కార్తీకమాసం సందర్భంగా గోవిందపురం, నర్సాపురం, వడ్డీవాడ, తోటాడ పంచాయతీల్లో నిరుపేద వృద్ధులకు వంద దుప్పట్లు పంపిణీ చేశారు. మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, పాకాల జగదీష్, సాయిబాబా పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న సూరిబాబు

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త హరికుమార్

నారు పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ ఆర్థిక సౌజన్యంతో మూడు రోజుల పాటు ఉద్యాన పంటల్లో నారు పెంపకంపై యువ రైతులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వివి ప్రసాద్, జిల్లా బిందు తుంపర సేద్యాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ మాట్లాడుతూ యువ రైతులకు పండ్ల తోటల్లో అంటుకట్టడం, కూరగాయల్లో నారు ప్రో ట్రేల ద్వారా తయారు చేయడం, అలంకరణ మొక్కల ప్రవర్ధన పద్ధతులపై, నర్సరీల ఏర్పాటుకు ఉద్యానవన శాఖ రాయితీలపై తెలియజేసి యువ రైతులకు పూర్తిస్థాయి నైపుణ్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానవనాధికారి కుమారి, నైరా వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ భారతి, ఉద్యానవన పరిశోధన స్థానం పెద్దపేట ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ బివికె భగవాన్ పాల్గొన్నారు.

పట్టాను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో కృష్ణాపురం గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 25-3లో గల భూమిలో గొర్లె సూరమ్మ (భర్త సత్యం) పేరున మంజూరు చేసిన పట్టాను రద్దుచేయాలని కృష్ణాపురం గ్రామస్తులు తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎస్.నారాయణ, గొర్లె ఎండినాయుడు, నడుపూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామ రెవెన్యూలోని సర్వేనెంబరు 25-3రులో 2ఎకరాల ప్రభుత్వ భూమి కలదని, సదరు భూమి తారురోడ్డుకు అనుకొని ఉందని, ఆ భూమిని మా గ్రామ ప్రజల అవసరాల నిమిత్తం, భవిష్యత్‌లో దేవాలయాల నిర్మాణములు, ప్రభుత్వ పరమైన భవన నిర్మాణాలకు ఉపయోగపడుతుందని ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. పై సర్వేనెంబర్‌లో గల భూమిలో గ్రామానికి చెందిన గొర్లె సూరమ్మ (భర్త సత్యం)కు పట్టా మంజూరు చేశారని, ప్రభుత్వ భూమిలో ఎటువంటి పట్టాలు మంజూరు చేయరాదని, ఈ ఏడాది జనవరి 31 జిల్లా కలెక్టర్, తహశీల్దార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ అధికారులు మంజూరు చేసారని ఆరోపించారు. మంజూరు చేసిన పట్టాను రద్దు చయకపోతే ఆందోళనలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పేద ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కావాలంటే టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సిఎం కావాలని, అందుకే ప్రజలంతా వస్తున్న ఎన్నికల్లో టిడిపికి ఓటువేసి చంద్రబాబునాయుడును సిఎం చేద్దామని నియోజకవర్గ టిడిపి తెలుగుయువత మహిళ అధ్యక్షురాలు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ అన్నారు. హరిశ్చంద్రపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 2024లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటలనే రాష్ట్ర ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రజలకు తెలియజేస్తూ గ్యారెంటీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోట అప్పన్న, మాజీ ఎంపిటిసి కోట నాగేశ్వరరావు, మార్పు భాస్కరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- టెక్కలి

మండల ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల నూతన కార్యవర్గం ఎంపిక బుధవారం స్దానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగింది. మండలశాఖ నూతన అధ్యక్షునిగా కిమిడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.చిట్టెమ్మ, కోశాధికారిగా బి.గాసయ్యలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. కొద్ది సంవత్సరాల నుంచి తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. డీలర్లుకు గుర్తింపు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

మహిళలకు ప్రభుత్వం ప్రాధాన్యత

కవిటి : వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ, ఎంపిపి

కవిటి : గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతిరహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆర్థికసాయం, ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం జగతి గ్రామంలో జగనే ఎందుకు రావాలి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి, వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పంచాయతీలో అందించిన సంక్షేమ పథకాల చార్ట్ విడుదల చేసి గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్యనున్న తేడాలు తెలియజేసి మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి చైర్మన్ బాబురావు, వైస్ చైర్మన్ నీలయ్య, జల్లు యుగంధర్, అశోక్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, నాయకులు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని జింకిభద్ర పంచాయతీ పరిధిలో బుధవారం ఎంపిపి నిమ్మన దాసు ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మరల జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.పద్మావతి, జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగారావు, నాయకులు ఎస్.భాస్కరరావు, ఎస్.జానీ, బాబురావు,

సోంపేట: మాట్లాడుతున్న ఎంపిపి దాసు

అనంత్, వెంకటరావు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం దంత సచివాలయం నందు వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు హాజరయ్యారు. వైసిపి జెండాను మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుతో కలిసి ఎగురవేశారు. అనంతరం సత్యరాజు స్థానిక నాయకులతో కలిసి పల్లినిద్రచేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, సర్పంచ్ గొండు చాందని మురళి, రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, నాయకులు పేడాడ వెంకటరావు, సనపల కృష్ణారావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు పంపిణీ

రణస్థలం : కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

రణస్థలం: ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ఎంపిపి ప్రతినిధి, వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తరుపున 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపడుతుందన్నారు. విద్యార్ధులకు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. ఆసక్తి ఉన్న 15 ఏళ్లకు పైబడిన క్రీడాకారులంతా గ్రామ సచివాలయంలో, వాలంటీర్ల ద్వారా, వెబ్‌సైట్ ద్వారా, 1902కి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల స్పెషల్ ఆఫర్ దుర్గారావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెదరామునాయుడు, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, కిల్లారి రమణ, మహంతి సత్యనారాయణ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మండలంలో పలు గ్రామ సచివాలయాలకు క్రీడా కిట్ల నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, ఎంపిడిఒ హెచ్‌వి. రమణమూర్తి, వైస్ ఎంపిపి మన్నెల కిషోర్, ఎంపిటిసిలు అనంతయ్య, సుగ్గు అప్పల రెడ్డి, టెక్కలి పంచాయతీ ఉప సర్పంచ్ గండి అప్పలరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత స్కాలర్‌షిప్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న కుమార్ రాజు

నగరంలోని జిల్లా శాఖాగ్రంథాలయంలో సైన్ ఇండియా అకాడమీ ఆధ్వర్యాన విద్యార్థులకు బుధవారం ఉచిత స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ సయ్యద్ ఆధ్వర్యాన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూప్-1, 2 పరీక్షల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలు జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి బి.కుమార్‌రాజు తోడ్పాటు అందించారు. సైన్ ఇండియా అకాడమీ పరీక్ష సిరీస్ కో-ఆర్డినేటర్ బి.సురేష్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ పరీక్షలు మొదటి పది ర్యాంకులు సాధించిన వారికి కోచింగ్‌లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఈ పరీక్షలకు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలో జె.దిలీప్‌కుమార్, ఎం.రంజిత, కె.ప్రతాప్, ఎం.వాణి, జె.రఘుకుమార్, ఎల్.హేమంతరామ్, ఎ.ప్రసాదరావు, జి.గౌతమి, పి.లక్ష్మణమూర్తి, కె.రాంబాబులు విజేతలుగా నిలిచారు. పరీక్షల నిర్వహణలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవి, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు గేయామృత ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

డిసెంబర్ 25 నుంచి 30 వరకు చండీఘర్‌లో జరగనున్న ఆల్‌ఇండియా సౌత్‌వెస్ట్ యూనివర్సిటీ పోటీలకు టెక్కలికి చెందిన బొడ్డ గేయామృత ఎంపికైందని శిక్షకులు నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విశాఖ ఆంధ్రాయూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో 68 కిలోల విభాగం నుంచి ఎంపికైన గేయామృత ఆల్ ఇండియా స్దాయిలో పాల్గొననున్నట్టు తెలిపారు. గేయామృత ఎంపిక పట్ల కోచ్ నర్సిపురం శేఖర్, పాండవుల జగదీష్ అబినందించారు.

ప్రజలు అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సంక్షేమ కేలండర్‌ను అవిష్కరిస్తున్న సూపరెండెంట్ రాజేశ్వరమ్మ

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని మండల పరిషత్ సూపరెండెంట్ రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలంలో అక్కయ్యవలస, విశ్వనాధపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని, ప్రభుత్వం దృష్టికి వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, ఉప్పాడ నర్సింహామూర్తి, శ్యామలరావు, కార్యదర్శి చైతన్య పాల్గొన్నారు.

105 ఏళ్ల తరువాత సొంత భవనానికి

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో సర్వీస్ కో-ఆపరేటివ్ సొసైటీ (వ్యవసాయ సహకార సేవా సంఘం) నూతంగా నిర్మించిన భవనాన్ని జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కో-ఆపరేటివ్ సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ హరిహర శెథి, కుంజన్ బిహారి పట్నాయక్, నారాయణ సేథి పాల్గొన్నారు. కాశీనగర్ సర్వీస్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు రొక్కం చలపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కాశీనగర్ పట్టణంలోని రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సొసైటీ 1918లో ఏర్పడింది. ఇప్పటి వరకు సొంత భవనం లేదు. 105 ఏళ్ల తరువాత సొంత భవనంలోకి వెళ్లడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వి.యోగి, సత్తారు కిరణ్ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ద్వితీయస్దానం సంపాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రోణంకి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి- కవిటి

కవిటి గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్సీ నర్తు రామారావును కోరారు. ఈ మేరకు బుధవారం కొత్తపుట్టుగలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రాంతాలకు మారుపేరైన కవిటిలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని, ఇప్పటికే కొంతమంది దాతలు తమ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. అయితే నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం నుంచి తమకు ఆర్థికసాయం అందించాలని ఎమ్మెల్సీ రామారావును కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మొగిలిపురి సీతాలు, బిపి రెడ్డి, డి దుర్యోధన, వెంకటరమణ, పొల్లాయి మోరేసు రుద్రయ్య, జె.లోకనాథం పాల్గొన్నారు.

సముదాయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

తరగతిగదిలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు బోధించే అంశాలను మరింత నైపుణ్యంగా బోధించేందుకు అవసరమైన మెళకువలను పాఠశాలల సముదాయాల ద్వారా ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని ఎంఇఒలు దల్లి తులసీరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు కోరారు. పట్టణంలో పలు పాఠశాల్లో బుధవారం పాఠశాలల సముదాయాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్జెక్ట్ బోదనతో పాటు సాధన కూడా అవసరమన్నారు. ప్రతినెల నిర్వహించే సముదాయాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు నేర్చుకునే ఆంశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సముదాయాల్లో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది రవి, సంతోష్, అట్టాడ మన్మధరావు పాల్గొన్నారు.

నాగబాబుతో రాజు భేటీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేనపార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు కొణిదెల నాగబాబును ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త దాసరి రాజు, నియోజకవర్గ జనసేనపార్టీ ఐటీ కో-ఆర్డినేటర్ కాళ్ళ దాలయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో పలు అంశాలపై చర్చలు జరిపినట్లు దాసరి రాజు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష పదవి నియామకం కోసం వివరించడం జరిగిందన్నారు. జిల్లాలో జరుగుతున్న సమన్వయ సమావేశాల్లో ఇచ్ఛాపురంలో జనసేన, టిడిపి ఉమ్మడి కార్యాచరణ, సమన్వయంతో ఎలా ముందుకు వెళ్ళాలని నాగబాబుతో సంప్రదించడం జరిగిందన్నారు. నాగబాబుని నియోజకవర్గంలో పర్యటించమని ఆహ్వానించడం జరిగిందన్నారు.